

ఎంఎల్సి ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

త్వరలో జరగనున్న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్సి ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులైన ప్రతి డిగ్రీ విద్యార్థి, ఉద్యోగులు ఓటరుగా నమోదు చేయించుకోవాలని ఎపి జెఎసి గోపాలపురం యూనిట్ చైర్మన్ జోడాల వెంకటేశ్వరరావు కోరారు. వెంకటేశ్వరరావు శనివారం పలు ప్రభుత్వ కార్యాలయాలు సందర్శించి ఉద్యోగులకు ఓటర్ నమోదు కోసం దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021లో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు, ఉద్యోగులు ఓట హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ స్థానం కోసం గతంలో ఉన్న ఓటర్ లిస్టులు అమలులో లేని కారణంగా పాత ఓటర్లు కూడా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆయన కలిసినవారిలో తాళ్లపూడి ఎస్ఐ టి.రామకృష్ణ తదితర ఉద్యోగులు ఉన్నారు.

ఎఫ్ఎలకు రాజకీయ వేధింపులు

- ఒక వైపు పని దినాల లక్ష్యం
- మరో వైపు అధికారుల ఒత్తిళ్లు
- ఆందోళనలో 'ఉపాధి' ఫీల్డ్ అసిస్టెంట్లు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ చట్టంలో క్షేత్రస్థాయిలో కీలకంగా పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయి. పనిదినాల లక్ష్యం గోరుచుట్టుపై రోకలి పోటులా మారింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత కోసం ఫీల్డ్ అసిస్టెంట్లు దశల వారీ పోరాటాలు చేసినా అధికార యంత్రాంగం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పని దినాలతో సంబంధం లేకుండా వేతనం ఇవ్వడంతో పాటు, జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికీ పని దినాల ఆధారంగానే జీతాలు ఇస్తుండటంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో 910 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లక్ష్యాలను చేరుకోవడంతో వెనుకపడుతూ రావడంతో దశల వారీగా 460 మంది సీనియర్ మేట్లుగా మిగిలిపోయారు. ఇదే విధానం అమలు చేస్తే రాబోయే రోజుల్లో పూర్తిగా ఉపాధికి దూరమవుతారనే ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది.

అందని ద్రాక్షలా టార్గెట్లు

ఏడాదిలో గ్రామంలో 7,500 పని దినాలు కల్పించిన వారిని ఎ-గ్రేడ్ కింద చేర్చి వారికి నెలకు రూ.8,900 వేతనం, రూ.350 అలవెన్స్ ఇస్తున్నారు. 7,500-6,500 మధ్య పని దినాలు కల్పించిన వారిని బి-గ్రేడ్గా పరిగణించి రూ.7,900 వేతనం, రూ.350 అలవెన్స్, అలాగే 5వేల నుంచి 6,500 మధ్య పనిదినాలు కల్పించిన వారిని సి-గ్రేడ్గా పరిగణించి రూ.6,400 వేతనం, రూ.350 అలవెన్స్ ఇస్తున్నారు. 5వేల కంటే తక్కువ పని దినాలు కల్పించిన వారికి జీతాలు ఉండవు. వీరిని సీనియర్ మేట్గా పరిగణిస్తారు. ఈ విధంగా జిల్లాలో 460 మంది సీనియర్ మేట్లుగా మిగిలిపోయారు. గ్రేడ్ల కోటాలో కొందరికి మాత్రమే జీతాలు చెల్లించి మిగిలిన వారికి మొండిచేయి చూపిస్తూ పొమ్మన కుండా పొగబెడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు.

మూడు నాలుగు నెలలే పనులు..

ఉపాధి హామీ పనులు ఏడాదంతా సాగడం లేదు. వేసవిలో మూడు నుంచి నాలుగు నెలలకు మించి పనులు జరగడం లేదు. ఫిబ్రవరి, మే వరకే కాస్త హడావుడి కనిపిస్తోంది. మిగతా రోజుల్లో ఆశించిన స్థాయిలో పనులు జరగట్లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనులుంటాయనే పేరుతో ఉపాధి పనులను నిర్వహించట్లేదు. ఇలాంటి పరిస్థితుల్లో తమ ఉద్యోగ భద్రత కరువైందని ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో దశల వారీ ఆందోళనలను ప్రారంభించారు. మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యామ్నాయం చూపించాలని కోరుతున్నారు. అదే విధంగా ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం కల్పించి 200 రోజులు పని కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అర్హత, అనుభవం కల్గిన ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రమోషన్, మండల స్థాయిలో బదిలీల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.10 లక్షలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, జూనియర్ మేట్, సీనియరల్ మేట్, ఫీల్డ్ అసిస్టెంట్ అనే తారతమ్యం లేకుండా అందరినీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా పరగణించి వేతనాలు చెల్లించాలని పాలకులను విజ్ఞప్తి చేస్తున్నారు.

రాజకీయ వేధింపులు

ఇటీవల పల్లెపండుగ పేరుతో ప్రభుత్వం అభివృద్ధి పనులను నిర్వహిస్తోంది. ఈ పనులను ఉపాధి హామీ కూలీలతో నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ నాయకుల పెత్తనం ఎక్కువైంది. అవసరం ఉన్నా లేకున్నా అనధికారికంగా వారితో సమావేశాలు నిర్వహిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నాయకులు చూపిన వారికే పని ఇవ్వాలనే ఒత్తిళ్లు ఎక్కువగా ఉన్నాయి. తమ పార్టీ కాని కూలీలను పక్కన పెట్టాలని అధికారపార్టీ నాయకులు మౌఖికంగా ఆదేశాలు ఇస్తున్నారు. వారిని కాదని పనులు కల్పిస్తే బెదిరింపులకు సైతం దిగుతున్నారని ఎఫ్ఎలు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అధికారులు కూడా నాయకులకే వత్తాసు పలకడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు నానా ఇబ్బందులు పడుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు

ఇసుక స్టాక్ ఫుల్... బుకింగ్ నిల్

- నిర్మాణరంగంలో ప్రతిష్టంభన తొలగించాలి
- భవన నిర్మాణకార్మికులకు ఉపాధి కల్పించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఉమామహేశ్వర రావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఇసుకను అందుబాటులోకి తెచ్చి నిర్మాణ రంగంలో ప్రతిష్టంభనను తొలగించాలి, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక శ్యామల సెంటర్లో సిపిఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందర్బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉమామహేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నూతన ఇసుక పాలసీని తీసుకువచ్చి ఉచిత ఇసుక అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు ముగిసినా నేటికీ ఉచిత ఇసుక ఎక్కడా దొరకట్లేన్నారు. డబ్బులకు కూడా మార్కెట్లో ఇసుక అందుబాటులో లేకుండా చేశారని విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లాలో బోట్స్ మన్ సొసైటీలకు, ఓపెన్ రీచ్లకు అనుమతులు ఇచ్చామని అక్టోబర్ 16 నుంచి ఆన్లైన్లో ఇసుకను బుకింగ్ చేసుకోవచ్చని కలెక్టర్ ప్రకటించారన్నారు. కాని కలెక్టర్ ప్రకటనకు ఆచరణకు పొంతన లేదన్నారు. రీచ్లో ఇసుక గుట్టలు ఉన్నా ఆన్లైన్, ఆఫ్లైన్లో బుకింగ్ కోసం వెళ్లిన వారికి భంగపాటు తప్పట్లేదన్నారు. రీచ్ల్లో ఇసుక అమ్మకాలు జరపట్లేదన్నారు. ఇసుక కొనుగోలు దారులకు నో స్టాక్ బోర్డుల వల్ల కష్టాలు తప్పడం లేదని తెలిపారు. గతంలో బోట్స్ మెన్ సొసైటీలకు ఇవ్వాల్సిన బకాయిలు కూడా పెద్దమొత్తంలో పెండింగ్లో ఉన్నాయన్నారు. సొసైటీల్లో కూలీలకు రూ.లక్షల్లో కూలి ఇవ్వాల్సి ఉందన్నారు. ఇసుక దొరకని ఫలితంగా నిర్మాణ రంగం కుంటుపడి పనులు స్తంభించాయన్నారు. భవన నిర్మాణ కార్మికులు పనులు లేక పస్తులు ఉండాల్సిన దారుణమైన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వారికి అప్పులు పుట్టే పరిస్థితి కూడా లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత ఇసుక హామీని నిలబెట్టు కోవాలన్నారు. ఇసుక లభ్యం అయ్యేలా చూడాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, జిల్లా కమిటీ సభ్యులు జె.రాంబాబు, బి.పవన్, మూర్తి, తులసి, రాణి, రాజా తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా నీటి సరఫరా

ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గోదావరి వరదలు వచ్చే సమయం లోనూ నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరాయంగా మంచినీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నామని, అందుకు సంబం ధించిన పనులు జరుగుతున్నాయని రాజమహేంద్ర వరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు) తెలి పారు. స్థానిక గోదావరి గట్టును ఉన్న హెడ్ వాటర్ వర్క్స్లో జరుగుతున్న 150 హెచ్పి వర్టికల్ టర్బైన్ హెవీ మోటర్ ఇన్స్టాలేషన్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో హెడ్ వాటర్ వర్క్స్లో 100 హెచ్పి, 60 హెచ్పి, 40 హెచ్పి ఇలా మొత్తం 10 మోటార్లు ఉండేవన్నారు. 100 హెచ్పి గంటకు 7 లక్షల లీటర్ల రా వాటర్, 60 హెచ్పి 6 లక్షలు, 40 హెచ్పి 5 లక్షల లీటర్ల రా నీటిని ఎత్తిపోసేవన్నారు. ప్రస్తుతం వాటి సామర్థ్యం తగ్గడంతో వరదల సమయంలో వాటిని పైకి తీయడం, తరువాత మళ్లీ వాటిని యథాస్థానాల్లో పెట్టడం శ్రమతో కూడుకున్నదన్నారు. గత పాలకులు దీన్ని పట్టించుకోలేదన్నారు. ఫలితంగా తాగునీటి సరఫరా విషయంలో ఇబ్బందులు పడ్డారన్నారు. కమిషనర్తో చర్చించి ఈ విషయాన్ని ప్రభుత్వ పాలకుల దృష్టిలో పెట్టమన్నారు. దీంతో 150 హెచ్పి వర్టికల్ టర్బైన్ మోటార్ను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. గంటకు 15 లక్షల లీటర్ల రా వాటర్ను తోడే సామర్థ్యం దీనికి ఉందన్నారు. ఫ్లడ్ సమయాల్లో కూడా ఇది నిర్విరామంగా పని చేస్తుందన్నారు. గతంలో సబ్ మెర్సిబుల్ మోటార్లు ఉండేవని తెలిపారు. నగర ప్రజల నీటి అవసరాలకు తగ్గట్టుగా అవి నీటిని తోడే సామర్థ్యం లేనందున... అలాగే ఫ్లడ్ సమయాల్లో పని చేయకపోవడంతో ఈ 150 హెచ్పి వెర్టికల్ టర్బైన్ మోటార్ను ఏర్పాటు చేశామన్నారు. దీన్ని ఏర్పాటుతో చాలా వరకూ తాగునీటి కష్టాలు తీరుతాయని ఆయన అన్నారు. ఆయన వెంట కూటమి నాయకులు, అధికారులు, తదితరులున్నారు.

22 నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపులు

ప్రజాశక్తి - చాగల్లు


చాగల్లు మండలంలో ఈ నెల 22 నుంచి 25 వరకూ ఆధార్ స్పెషల్ క్యాంప్లను నిర్వహిస్తున్నటుట ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి తెలిపారు. 22న చాగల్లు జడ్పి హైస్కూల్, ఎంపిపి స్కూల్, షుగర్ ఫ్యాక్టరీ, బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పవరం గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. 23న చాగల్లు జడ్పి హై స్కూల్, ఎంపిపి స్కూల్, స్కూల్ షుగర్ ఫ్యాక్టరీ, బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పవరం గ్రామాల్లో కొనసాగుతాయన్నారు. 24న మీనానగరం గ్రామ సచివాలయం, నేలటూరు పంచాయతీ, చంద్రవరం, మార్కొండపాడు గ్రామ సచివాలయాల్లో జరుగుతాయన్నారు. 25న మీనానగరం గ్రామ సచివాలయం, నేలటూరు గ్రామ సచివాలయం, మల్లవరం, మార్కొండపాడు ససివాలయాల వద్ద ఆధార్ ప్రత్యేక క్యాంపులు జరుగుతాయన్నారు. మండలంలోని గ్రామస్తులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దమ్మెన్నులో గ్రామ సభ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రీ సర్వేపై శనివారం దమ్మెన్నులో గ్రామ సభను నిర్వహించారు. రైతులు పలు సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ సభను తహశీల్దార్ పిఎన్డి.ప్రసాద్ పరిశీలించారని రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ ఎం.హరిప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గురజర్ల వీరవెంకటసత్యనారాయణ, మండల సర్వేయర్ జి.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది, సర్వే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఏకాగ్రతోనే లక్ష్య సాధన

రైఫిల్ షూటింగ్ టోర్నీప్రారంభోత్సవంలో రాజానగరం ఎంఎల్ఎ బత్తుల

ప్రజాశక్తి - రాజానగరం

ఏకాగ్రతతో సాధన చేస్తే లక్ష్యాలను సాధించొచ్చని రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యా శాఖ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే 68వ ఎపి అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ టోర్నీ 024-25 సంపత్ నగరం రాజమహేంద్రి ఇంటర్నేషనల్ కళాశాల ఆవరణలో శనివారం ప్రారంభమైంది. ఎంఎల్ఎ బత్తుల క్రీడా జ్యోతిని వెలిగించి టోర్నీని ప్రారంభంఇంచారు. అనంతరం రాష్ట్రంలో 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షత ఏర్పాటు చేసిన సభలో ఎంఎల్ఎ బత్తుల మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యం వైపు సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. దేశ ప్రతిష్టను పెంపొందించేలా ప్రతిభ చూపాలని చెప్పారు. జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎస్ఆర్కెవి.స్వామి మాట్లాడుతూ ఈ టోర్నీలో విజేతలు మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్లో జరిగే జాతీయ పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ లక్ష్యాలు నిర్ణయించుని సాధన చేస్తే విజయాలు వాటంతట అవే వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడా సమాఖ్య సహాయ కార్యదర్శి రాధాకృష్ణ, ఉప విద్యా శాఖాధికారి నారాయణ, రాజానగరం సిఐ ప్రసన్నవీరయ్యగౌడ్, కళాశాల డైరెక్టర్ టి.స్వరూప్రెడ్డి, ప్రిన్సిపల్ టివిడి.చంద్ర శేఖర్, సంపత్ నగర్ ఎంపిటిసి సదానంద కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



షూటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ

చంటియ్య కుటుంబానికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి- కడియం

మండలంలోని కడియపు లంకలో ఇటీవల మరణించిన శ్రీసత్యదేవ నర్సరీ అధినేత పుల్లా సత్యనారాయణ (చంటియ్య) కుటుంబాన్ని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ శనివారం పరామర్శించారు. చంటియ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చంటితో వారి కున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. చంటియ్య కుమారుడు పెద్ద సత్యనారాయణ, చంటియ్య సోదరుడు ఆంజనేయులు, పుల్లా సోదరులు వీర వెంకటరావు, వీర్రాజు, చిన్న సత్యనారాయణ, డాక్టర్ రామకృష్ణ, శ్రీకాంత్లను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. అలాగే టిడిపి రాష్ట్ర నాయకులు గన్ని కృష్ణ, సిసిసి ఛానల్ అధినేత పంతం కొండలరావు, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు చంటియ్య కుటుంబాన్ని పరామర్శించారు.



చంటియ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి దుర్గేష్

పిడుగు పడి చెరుకు తోట దగ్ధం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని గజ్జరం గ్రామానికి చెందిన రైతు మద్దుకూరి పెద్దబ్బులుకు చెందిన చెరకు తోటలో శనివారం మధ్యాహ్నం పిడుగు పడటంతో తోట దగ్ధమైంది. సుమారు ఐదు ఎకరాల్లో పంట కాలిపోవడంతో లక్షల్లో నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. కొద్దిపాటి చినుకులు కూడా పడటంతో కొత మేర పంట బయటపడిందని రైతు తెలిపాడు. కాలిపోయిన చెరుకు పంటను రైతులు దత్తుడు, సత్తిబాబు, తాడువాయి చెరుకు ఫ్యాక్టరీ సిబ్బంది పరిశీలించారు.

క్రీడలకు సహకారం అందిస్తాం

ప్రజాశక్తి - కడియం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించేందుకు ఉపాధ్యాయులతో పాటు విద్యా కమిటీ తరపున సహకరిస్తామని మండలంలోని మురమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కాటే జ్యోతిబాబు, హెచ్ఎం బొండాడ సుధ తెలిపారు. పాఠశాలకు సుమారు రెండు ఎకరాల క్రీడా మైదానంఉందని, అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు పిచ్చి మొక్కలు, పచ్చగడ్డితో క్రీడా మైదానం నిండిపోయి నిరూపయోగంగా మారిందన్నారు. విష సర్పాలకు ఈ మైదానం నిలయమైందన్నారు. దీంతో విద్యార్థులు అటువైపు వెళ్లడానికి భయాందోళనకు గురవుతున్నారు. దీనిని గుర్తించిన విద్యా కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయురాలు సుమారు రూ.15 వేలు ఖర్చుతో కలుపు మందును పిచికారీ చేయించారు. ఏపుగా పెరిగిన ముళ్ల జాతి మొక్కలను కూలీలతో తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లితండ్రులు, గ్రామ ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు.

గోపాలపురం తహశీల్దార్గా విద్యాపతి

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం తహశీల్దార్గా సిహెచ్ విద్యాపతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో కొవ్వూరు ఆర్డిఒ కార్యాలయంలో తహశీల్దార్గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయనకు విఆర్ఒలు, విఆర్ఎలు, రేషన్ డీలర్లు, సర్వేయర్లు, ఆఫీస్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాపతి మాట్లాడుతూ మండల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.



తహశీల్దార్కు శుభాకాంక్షలు చెబుతున్న సిబ్బంది

ఘనంగా పెందుర్తి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - సీతానగరం

రాజానగరం మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్ తనయుడు పెందుర్తి అభిరామ్ పుట్టిన రోజు వేడుకలను శనివారం నియోజకవర్గంలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ దివాన్ చెరువు గ్రామంలో శ్రీ హర్షిత పబ్లిక్ స్కూల్ ప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. దివాన్ చెరువు గ్రామ సెంటర్లో ఖండవల్లి లక్ష్మి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. సీతానగరం మండలం ఇనగంటివారి పేటలో శ్రీ శిరిడి సాయి కళ్యాణ మండపంలో వేద పండితులు పూర్ణ కుంభంతో, మేళతాళాలతో స్వాగతం పలికారు. సీతానగరం మండల పెందుర్తి అభిమానులు, టిడిపి నాయకులు నాయకులు శాలువాలతో యువనాయుకుడు అభిరామ్ను సత్కరించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి ఆత్మీయ విందులో పాల్గొన్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో సరస్వతి స్కూల్స్ శివాజీ, గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే గరగలంపాలెంలో కృష్ణమోహన్, బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని కేక్ కటింగ్ చేశారు. కోరుకొండ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ మండపంలో జరిగిన జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిరామ్ మాట్లాడుతూ నమ్ముకున్న వ్యక్తులను తన తండ్రి పెందుర్తి వెంకటేష్ ఎప్పుడూ విడిచిపెట్టలేదన్నారు. రాజానగరం ఎంఎల్ఎగా బత్తుల బలరామకృష్ణ గెలుపు పుట్టినరోజు కానుకగా భావిస్తున్నట్లుగా తెలిపారు. తండ్రి వెంకటేష్ ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు కొంతమంది అక్రమాలకు పాల్పడ్డారని, వారికి సపోర్ట్ చేయలేదనే కారణంతో తిరుగుబాటు ప్రయత్నాలు చేసి వారు విఫలమైయ్యారన్నారు. నిజాయితీగా ఉంటే ఎవరినైనా సరే టిడిపి అధిష్టానం గుర్తిస్తుందన్నారు. దానికి నిదర్శనం పెందుర్తి వెంకటేష్ అని తెలిపారు. నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చూపించిన ప్రేమానురాగాలు ఎప్పటికీ మరువలేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



పుట్టినరోజు కేకును కట్ చేస్తున్న పెందుర్తి అభిరామ్

సిసి రోడ్లు, డ్రెయినేజీలకు శంకుస్థాపన

ప్రజాశక్తి - చాగల్లు

పల్లెపండుగలో భాగంగా చాగల్లు మండలంలో రూ.84 లక్షలతో చేపట్టే సిసి రోడ్లు, డ్రెయినేజీల పనులకు కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం శంకుస్థాపనలు చేశారు. చాగల్లు సర్పంచ్ ఉండమట్ల మనశ్శాంతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల రూపాయలు ఏమైయ్యాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఆర్థిక వనరులను సమకూర్చుకుంటూ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చాగల్లు మండలానికి మరో రూ.50 లోలు నిధులు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. చాగల్లు గ్రామంలో అశోక్ నగర్ ఏరియా ప్రాంతంలో ఇంటర్నల్ సిసి రోడ్ రూ.10లక్షలు, మీనానగరంలో సిసి రోడ్ రూ.12 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు. నేలటూరులో సర్పంచ్ ఎడ్లపల్లి ఉమా రజిని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రూ.10 లక్షలతో నిర్మించే సిసి రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే ఊనగట్ల, బ్రాహ్మణ గూడెంలో వెంకటేశ్వరస్వామి కాలనీ, చంద్రవరం, మల్లవరం గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, టిడిపి నాయకులు ఆళ్ల హరిబాబు, కేతా సాహెబ్, కె.సతీష్, ఎన్.శ్రీరామ్చౌదరి, మాజీ సర్పంచ్ జొన్నకోటి వెంకయ్యమ్మచ, కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకను తుంగలో తొక్కారు

పిసిసి సభ్యులు సతీష్

ప్రజాశక్తి - గోపాలపురం

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని తుంగలో తొక్కిందని పిసిసి సభ్యులు జ్యేష్ట సతీష్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలో గొప్పగా చెప్పిన ఉచిత ఇసుక ఎక్కడా అమలు కావట్లేదన్నారు. అతని కంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్న చందంగా ప్రభుత్వ పరిపాలన ఉందని విమర్శించారు. గృహ అవసరాలకు సంబంధించిన ఇసుకను ఆన్లైన్లో బుక్ చేసుకోవాలని సూచించారని, వారం రోజులుగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వం ప్రజలకు అవసరమైన ఇసుక విధానంపై దృష్టి తగ్గించి మద్యం విధానంపై కేంద్రీకరించిందని విమర్శించారు. ప్రభుత్వం ఇసుక విషయంలో ఆరంభ సూరత్వం కనపడిందన్నారు. వెంటనే ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ప్రజలు ఇబ్బందులకు పడకుండా ఉచిత ఇసుకను అందించాలని కోరారు.

ఒక్కటైన వికలాంగుల జంట

ప్రజాశకి- కడియం

రెండేళ్ల క్రితం అమలాపురంలో వైద్య పరీక్షలకు వెళ్లిన ఇద్దరు వికలాంగులు ఒకరినొకరు ఇష్టపడ్డారు. అది ప్రేమగా మారింది. వేరువేరు కులాలకు చెందిన వీరిద్దరి ప్రేమ వ్యవహారాన్ని ఇంట్లో పెద్దలకు తెలియపరిచారు. అమ్మాయి తరపు తల్లిదండ్రులు వ్యతిరేకించడంతో ఎంఆర్పిఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఎంఆర్పిఎస్ రాష్ట్ర నేత దూలి జయరాజు, విహెచ్పిఎస్ నాయకుడు షేక్ నబీ స్పందించి అబ్బాయి తల్లితో మాట్లాడి పెళ్లి ఒప్పించారు. కె.గంగవరం మండలం పాణింగపల్లికి చెందిన లంక మంగమ్మ(31), కపిలేశ్వరపురం మండలం వడ్లమూరుకు చెందిన వేములపూడి ప్రసాద్(32)లకు శనివారం మండపేటలో ఆదర్శ వివాహం జరిపించారు. క్రైస్తవ మతాచారం ప్రకారం చర్చిలో వివాహం జరిపించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ ఆదర్శ వివాహం చేసుకున్న జంటకు ప్రభుత్వ ప్రోత్సాహకం అందించాలని విజ్ఞప్తి చేశారు. కులాంతర వివాహాలను ప్రోత్సహించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ఈ వివాహం జరిపించామన్నారు.



నూతన జంటను ఆశీర్వదిస్తున్న పెద్దలు

'ఉపాధి' నిధుల మంజూరు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలానికి ఉపాధి హామీ చట్టంలో భాగంగా రూ.2.50 కోట్లు మంజూరయ్యాయని ఎంపిడిఒ ఆర్ శ్రీదేవి తెలిపారు. మొదటి విడతగా రూ.1.13 కోట్లు, 2వ విడతగా రూ.1.43 కోట్లు విడుదలయాయయని తెలిపారు. ఉపాధి పనుల్లో భాగంగా సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం, పంటకాలువలు, చెరువుల పూడిక తీత, షెడ్ల నిర్మాణం, మొక్కల పెంపకం వంటి పనులకు వీటిని వెచ్చిస్తామని ఆమె తెలిపారు.

నేరాలు ఘోరాలు

లైంగిక వేధింపుల కేసులో వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి - కాట్రేనికోన

బాలికను లైంగికంగా వేధించిన వివాహితుడిపై శనివారం కేసు నమోదు చేసిన పోలీసులు అతనిని రిమాండుకు తరలించారు. వివరాలు ఇవి.. కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని జిల్లెళ్లవారి పేటలో వివాహితుడు వాకపల్లి ఏసు బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాలిక తన తల్లిదండ్రుల సహాయంతో కాట్రేనికోన పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. వివాహితుడు ఏసుపై పోలీసులు శనివారం పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. అనంతరం అతనిని కోర్టుకు తరలించగా, కోర్టు నిందితునికి రిమాండ్ విధించింది. పోలీసులు నిందితుడిని సబ్ జైలుకు తరలించారు.

నలుగురు పోలీసుల సస్పెన్షన్

ప్రజాశక్తి - పెరవలి

రికవరీ సొమ్ములో చేతివాటం ప్రదర్శించిన సిఐ, ఎస్ఐ, రైటర్, కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. నిడదవోలు సర్కిల్ పెరవలి పోలీస్ స్టేషన్ పరిధిలో అన్నవరప్పాడు పరిసర ప్రాంతంలో పేకాట శిబిరాలను నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు సెప్టెంబర్ 9న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పేకాటరాయుళ్లను ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6.45 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కేసులో మాత్రం రూ.55 వేలు మాత్రమే దొరికినట్టు చూపారు. విషయం ఎస్పి నరసింహ కిషోర్ దృష్టికి వెళ్లింది. ఈ మేరకు ఉన్నతాధికారులు రహస్య విచారణ చేపట్టారు. ఖాకీల చేతివాటం రుజువు కావడంతో నలుగురుపై సస్పెన్షన్ వేటుకు ఆదేశాలు జారీ చేశారు.

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడి బాడవ హై స్కూల్ సమీపంలో 216వ జాతీయ రహదారిలో లారీని వ్యాన్ ఢీ కొట్టిన సంఘటనలో నలుగురుకి గాయాలయ్యాయి అమలాపురం వైపు వెళుతున్న ఊక లారీని మామిడికుదురు వైపు వస్తున్న వ్యాన్ ఢీ కొట్టి తిరగబడింది. శనివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో వ్యానులో ఉన్న డ్రైవర్, క్లీనర్లతో పాటు, లారీ డ్రైవర్, క్లీనర్ కు స్వల్ప గాయాలయ్యాయి చికిత్స నిమిత్తం వారిని అమలాపురం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

పాము కాటుతో విద్యార్థిని మరణం

ప్రజాశక్తి -కరప

కరప మండలం సిరిపురం గ్రామానికి చెందిన రెండవ తరగతి విద్యార్థిని పాముకాటుకు గురై మతి చెందినట్లు కరప పోలీసులు తెలిపారు. పూలపల్లి నాగరాజు కుమార్తె పూలపల్లి ఉష్రశ్రీ (8) ప్రభుత్వ పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. పాఠశాలలో ఉదయం 7.30 గంటలకు జ్వరం రావడంతో వెంటనే 108లో చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రి తరలించగా వైద్యులు విద్యార్థిని పరీక్షించి ఎడమ కాలుపై పాము కాటు వేసిందన అనుమానించి వైద్యులు చికిత్స అందించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కరప

కొబ్బరి చెట్టు మీద నుండి పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కరప పోలీసులు తెలిపారు. ఈ నెల 10వ తేదీన రామచంద్రపురం మండలం కాపవరం గ్రామానికి చెందిన కొబ్బరికాయలు దింపు కార్మికుడు కరప మండలం వడ్డీపాలెం గ్రామంలోని కొబ్బరి చెట్టుపై నుంచికాయలు దింపుతుండగా ప్రమాదవశాస్తూ కింద పడిపోయాడు. అతనిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ తరలించగా శనివారం పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవు

ప్రజాశక్తి-కాజులూరు

మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. పలు వాహనాలను తనిఖీ చేసి జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో గొల్లపాలెం పోలీసులు పాల్గొన్నారు.

భాష్యంలో వరల్డ్ ఫుడ్ ఫెస్టివల్ డే

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట భాష్యం పాఠశాలలో శని వారం వరల్డ్ ఫుడ్ డే ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రకరకాల పిండివంటలు, స్వీట్స్, ఫ్రూట్స్ తీసుకుని వచ్చి ప్రదర్శించారు మాస్టర్ చెఫ్ వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సూర్య, శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్‌ఛార్జి వి.గోవిందరాజు విద్యార్థులను అభినందించారు.

చోరీలు, ట్రాఫిక్‌పై ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - సామర్లకోట

దొంగతనాలు, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టితో ముందుకెళుతున్నట్టు సామర్లకోట సిఐ ఎ.కృష్ణ భగవాన్ అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ మధ్యకాలంలో రాత్రి సమయంలో పలుచోట్ల దొంగతనాలు జరుగుతున్నట్లు వస్తున్న సమాచారం పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండా లన్నారు. అనుమానితులపై వెంటనే 100 నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. విలువైన ఆభరణాలు గహాల్లో ఉంచుకోకుండా జాగ్రత్త పడాలన్నారు.

చిత్ర లేఖనంలో స్వాతి ప్రతిభ

ప్రజాశక్తి - సామర్లకోట

జిల్లా స్థాయిలో పిఎంశ్రీ స్కూల్స్ నిర్వహించిన చిత్ర లేఖనం పోటీల్లో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని ఎం.స్వాతి లక్ష్మి ద్వితీయ స్థానం సాధించినట్టు హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీలు శుక్రవారం ఎపిఎస్‌పి జెడ్‌పి హైస్కూల్‌లో ఎఎంఒ ఎం.రామారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రాయింగ్ టీచర్ ఆర్.శివకుమార్, విద్యార్థిని హెచ్ఎం రామకృష్ణ, స్కూల్ కమిటీ చైర్మన్ అక్కిన చక్రధర్, ఎంఇఒలు వై శివ రామ కష్ణయ్య, పి.పుల్లయ్య, కమిషనర్ శ్రీవిద్య అభినందించారు.

హామీలు సరే... ఆచరణ ఏదీ..?

గోదారి గలగలలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ఆచరణలో మరిచింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉచిత ఇసుక విధానమే దీనికి నిదర్శనం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచిన ఉచిత హామీ నేటికీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు. ఎప్పోసాపో చేసి ఇసుకను కొనుగోలు చేద్దామన్నా ఇసుక రేణువులు కూడా దొరకని పరిస్థితి. నిర్మాణ పనులను ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. భవన నిర్మాణ రంగంలో తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. ఏ దింతో భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన 26 రంగాల కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. పనులేక పస్తులుంటున్నారు. ఆ నెల 16 నుంచి ఉచిత ఇసుక అందుబాటులో ఉంటుందని కలెక్టర్ స్వయంగా ప్రకటించారు. జిల్లాకు 14 వరకూ ఓపెన్ రీచ్‌లు కేటాయించామని తెలిపారు. సమావేశాలు, సమీక్షలు నిర్వహించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలంటూ చెప్పుకొచ్చారు. ఇదంతా భాగానే ఉన్నా... ప్రకటన వెలువడి నాలుగు రోజులైనా నేటికీ ఇసుక దొరకని పరిస్థితి. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవడం పెద్ద ప్రహసనంగా మారింది. సాంకేతిక కారణాల ఫలితంగా రోజుల తరబడి కొనుగోలు దారులు ఎదురు చూడాల్సి వస్తోంది. ఆఫ్‌లైన్‌లోనూ ఇదే పరిస్థితి. అక్కడక్కడా ఒకటిరెండు ఎడ్లబళ్లు, ఒకటి రెండు ట్రాక్టర్ల ఇసుక తప్ప ఎక్కడా పూర్తిస్థాయిలో ఇసుక దొరకని పరిస్థితి. ఉచితం మాట ఎలా ఉన్నా కనీసం ఇసుకైనా ఇప్పించి ఉపాధి చూపించండంటూ భవన నిర్మాణ రంగ కార్మికులు వేడుకుంటున్నారు.

ఇసుక దొరక్క భవన నిర్మాణ కార్మికులు నానా ఇబ్బందులు పడుతుంటే నూతన మద్యం పాలసీ పుణ్యమా అని ఎక్కడికక్కడ మద్యం మాత్రం ఏరులై పారుతోంది. నూతన మద్యం పాలసీతో గుడి, బడి ఇలాంటివేమీ పట్టించుకోకుండా మద్యం దుకాణాలు వెలశాయి. ఇళ్ల మధ్య దుకాణాలు తొలగించాలని మహిళలు రోడ్డెక్కుతున్నా... సర్కారులో మాత్రం ఎలాంటి చలనం లేదు. మద్యంపై ఆదాయమే పరమావధిగా సర్కారు తీరు ఉండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే కొత్త దుకాణాల్లో పాత మద్యానికే పాత ధరలకే అమ్మడంపై మందుబాబులు సైతం పెదవి విరుస్తున్నారు. 2024 ఎన్నికల్లో 'నాణ్యమైన మద్యం సరసమైన ధర' అంటూ హామీ ఇచ్చిన కూటమి అనుకున్నట్టే ఆఘమేఘాలపై టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి ప్రైవేటు మద్యం షాపులకు అనుమతులు ఇచ్చేసింది. టెండర్లు, లాటరీ, షాపుల ఏర్పాటు చకచకా జరిగిపోయాయి. అయితే అడుగడుగునా అధికార పార్టీ నేతల కనుసన్నల్లో మద్యం సిండికేట్ చక్రం తిప్పిందనేది బహిరంగ రహస్యమే. అయితే గతంలో విక్రయించిన ధరలు, అవే బ్రాండ్లు ఉండటంతో మందుబాబులు సైతం విస్తుపోతున్నారు.

మరో పక్క ఉమ్మడి జిల్లాను వరుణుడు వీడట్లేదు. జిల్లా వ్యాప్తంగా వరి కోతలు వడివడిగా ప్రారంభం అవుతున్నాయి. ఈ సమయంలో బంగాళాఖాతంలో ఒక వాయుగుండం రెండు రోజుల క్రితం తీరం దాటింది. ఈ సమయంలో కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. కొన్ని చోట్ల ధాన్యం తడిసిపోయింది. తరువాత రెండు రోజుల పాటు ఎండలు కాడంతో అన్నదాతలు ఊపిరిపీల్చుకున్నారు. ఇదే సమయంలో వాతావరణ శాఖ మరో వాయుగుండం హెచ్చరికలు చేయడంతో రైతుల్లో మళ్లీ ఆందోళన నెలకొంది. ఈ నెల రెండో వారం నుంచి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే కొనుగోళ్లు మాత్రం అనుకున్న రీతిలో జరగట్లేదు. నిబంధనలు, దళారుల రాకతో అన్నదాతలు విస్తుపోతున్నారు. చేసేది లేక కొంత మంది అయినకాడికి దళారులకు అమ్ముకుంటున్నారు.

ఎంఎల్‌సి ఎన్నికలకు సమాయత్తం

ఎంఎల్‌సి ఎన్నికలకు ఉభయగోదావరి జిల్లాల్లో రాజకీయ పార్టీలు సంసిద్ధమవుతున్నాయి. ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలతో పాటు పలు ప్రజా సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించి అనేక సమస్యలకు పరిష్కార మార్గం చూపిన చరిత్ర పిడిఎఫ్ ఎంఎల్‌సిల సొంతం. తాజాగా ఉపాధ్యాయ ఉద్యమాల్లో కీలకంగా పనిచేసిన గోపిమూర్తి పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా బరిలో నిలిచారు. మండలిలో తమ గళం వినిపించేందుకు గోపిమూర్తిని గెలిపించుకునేందుకు ఉపాధ్యాయ సంఘాలు నడుంబిగించాయి. ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతం చేస్తున్నాయి. ఇదే సమయంలో కూటమి ప్రభుత్వం కూడా ఉపాధ్యాయ సంఘాలు సూచించిన వ్యక్తిని బలపర్చేందుకు పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే ఇటీవల రాజమహేంద్రవరంలో మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఇతర కీలక నాయకుల ఆధ్వర్యంలో సమావేశాన్ని సైతం నిర్వహించింది. కోనసీమకు చెందిన అభ్యర్థిని బరిలో ఉంచాలని నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. దాదాపుగా ఖరారైన అధినేత ప్రకటన కోసం అందరూ వేచి చూస్తున్నారు.



గొడౌన్‌లోని ఇవిఎంల వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ఇవిఎంల భద్రతకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఇవిఎం), ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రైయల్ (వివిప్యాట్ల) గొడౌనల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఎన్నికల రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని జిల్లా కార్యాలయాల సముదాయం మూడో అంతస్తులో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వివి ప్యాట్లను భద్రపరిచిన గొడౌన్‌ను కలెక్టర్, రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక శాఖల అధికారులు మరియు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం గోదామును తనిఖీ చేసి ఇవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి తీసుకున్న చర్యలను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గ నిర్దేశాల మేరకు నెలవారీ తనిఖీలో భాగంగా ఇవిఎం, వివిప్యాట్ గొడౌన్‌ను తనిఖీ చేశామన్నారు. అలాగే ప్రతి త్రైమాసానికి ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, కో ఆర్డినేషన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, స్థానిక తహశీల్దార్ ఎంవి.సుబ్బలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ శివ రాజు ఆర్ఐ రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్లేస్కూల్ విధానంలో బోధిస్తున్న టీచర్ కుసుమ

కాల్దారి పాఠశాలలో నో బ్యాగ్ డే

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా బోధనోపకరణాలతో విద్యార్థులకు ఆటలను నేర్పిస్తున్నట్లు ఉపాధ్యాయిని కుసుమ తెలిపారు. మండలంలోని కాల్దారి నెంబర్-3 పాఠశాలలో ఆమె ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్నారు. పనికిరాని అట్ట ముక్కలతో పిన్ బాల్, బాస్కెట్ బాల్, దారి తెలుసుకొండి వంటి ఇండోర్ ఆటలను ఆడుకునేందుకు స్వయంగా ఉపకరణాలను ఆమె తయారు చేశారు. పిల్లలు పాఠశాలకు ఆకర్షితులయ్యేలా ఆటపాటలతో ఉత్తేజ పరుస్తున్నట్లు తెలిపారు. బోధనోపకరణ సామగ్రి, బోధనను ఆకర్షనీయంగా చేసే సాధనం అని కుసుమ అన్నారు. అభ్యాసన ప్రక్రియ పట్ల విద్యార్తులకు ఆసక్తి కలిగించే విధంగా పాఠ్య బోధనను కొనసాగిస్తున్న ఆమెను హెచ్ఎం సుభద్రకుమారి, తోటి ఉపాధ్యాయులు కట్టా హేమలత, శివప్రసాద్, తదితరులు భినందించారు.

యానాం వార్తలు

అధికారులతో మల్లాడి సమావేశం

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గ సమస్యలు, అభివద్ధి పనులపై స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్ఎఒ మునిస్వామి సమక్షంలో వివిధ శాఖల అధికారులతో పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో స్మార్ట్ స్కూల్ ప్రతిపాదన మేరకు ఈ నెల 4వ తేదీన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం ఏడు స్కూల్స్ ఎంపిక కాగా ప్రతి హైస్కూల్లో ఐదు స్మార్ట్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సిఎస్ఆర్ నిధులలో చేపట్టే అభివృద్ధి పనులకు బుధవారం నాటికి టెండర్లకు పిలవాలన్నారు. సాయి స్పోర్ట్స్ హాస్టల్, మెట్టకూరు గ్రామ డెవలప్మెంట్, అయ్యన్న నగర్ బ్రిడ్జింగ్ వర్క్, ఇందిరాగాంధీ మార్కెట్లో అభివద్ధి పనులు, తదితరవాటికి ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుంటానని తెలిపారు. మున్సిపాలిటీ, పిడబ్ల్యుడి శాఖల్లో పెండింగ్లో ఉన్న పనులను మొదలు పెట్టాలని, దానికి సంబంధించి ప్రభుత్వంతో మాట్లాడతానని తెలిపారు. ఆంధ్రాలో సరిహద్దు ప్రాంతంలో ఉన్న పందులంక భూమి యానంకు చెందినదని కోర్టు తీర్పు ఇచ్చిందని ఎలాంటి గొడవలు జరగకుండా పోలీస్ శాఖ,రెవెన్యూ డిపార్ట్మెంట్ అధికారులు చూసుకోవాలన్నారు.

డంపింగ్ యార్డు తరలించాలని ఆందోళన

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట ఏటిగట్టు రోడ్డులోని డంపింగ్ యార్డును తక్షణమే తొలగించాలని కనకాల పేట గ్రామస్తులు శనివారం నిరసన తెలిపారు. కొన్నేళ్లుగా డంపింగ్ యార్డును తరలించాలని ముక్తకంఠంతో ప్రజలు కోరుతున్నా ప్రభుత్వం నేటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని కోన సుబ్బారావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రజలు, విద్యార్థులు రోడ్డుపై రాకపోకలు సాగించడానకి దుర్గంధం వల్ల అవస్థలు పడుతున్నారన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలో గంజాయిని విక్రయిస్తున్న నలుగురు యువకులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌పి రాజశేఖరన్ తెలిపారు. స్థానిక రీజెన్సీ స్కూల్‌కు వెళ్లే పరిసర ప్రాంతంలో నలుగురు యువకులు గంజాయిని విక్రయిస్తుండగా క్రైమ్ టీమ్ దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. యానాం ఫెర్రీరోడ్డుకు చెందిన సంగాడి మహేష్ బాబు, తాళ్లరేవు మండలం సీతారామపురానికి చెందిన గెడ్డం రాజు, అయ్యన్ననగర్‌కు చెందిన పెసింగి నాని, పెనుపోతు విజయదుర్గావరప్రసాద్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 500 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను యానాం సబ్ కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు. ఈ సమావేశంలో సిఐ షణ్ముగం, ఎస్సై మురుగునందమ్ పాల్గొన్నారు.

జనసేన నాయకుడు నాగరాజు మృతి

ప్రజాశక్తి - పెరవలి



మండలంలో కానూరు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు నాగరాజు గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన ఉన్నారు. పార్టీ మండల ఉపాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు నాగరాజు మరణ వార్త తెలియగానే పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కానూరు చేరుకొని నాగరాజుకు నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు నాగరాజు మృతి పార్టీకి తీరని లోటు అన్నారు ఆయన వెంట జనసేన మండల అధ్యక్షుడు పిప్పర రవి, నాయకులు పాల వీరాస్వామి, సంగీత నాగు, పోలిరెడ్డి రాంబాబు, కాకర్ల నాని వాకలపూడి వీర్రాజు, ముళ్ళపూడి రాజు, కొమ్మిశెట్టి రామకష్ణ, రంకిరెడ్డి ప్రసాద్ తదితరులున్నారు.

రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - రామచంద్రపురం

హసన్‌బాద గ్రామంలో ఉపాధి హామీ చట్టం నిధులతో సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో రూ.3.లక్షల సిమెంటు రోడ్డు పనులకు శంకు స్థాపన చేశారు. హసన్‌బాద ఎంపిటిసి సభ్యుడు యన్నందేవి, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు చింతపల్లి వీరభద్రరావు, రామచంద్రపురం ఎంపిడిఒ కె.పద్మజ్యోతి, పంచాయతీ రాజ్ ఎఇ ఏసురత్నం మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం పాల్గొన్నారు కూటమి నాయకులు,ప్రజా ప్రతినిధులు, ఉప సర్పంచ్ నీలం భవాని, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




భూమి పూజ చేస్తున్న సర్పంచ్ సతీష్‌రావు

బాధిత కుటుంబాలకు సూర్యప్రకాష్ పరామర్శ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఇటీవల కోటిపల్లి గోదావరిలో గల్లంతై మరణించిన రాయిచెరువు గ్రామ యువకులు నరాల వేద మూర్తి, మేడిసెట్టి వీరబ్రహ్మం కుటుంబాలను నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ పిల్లి సూర్య ప్రకాష్ శనివారం పరామర్శిం చారు. ఈ సందర్భంగా సంఘటన వివరాలు తెలుసు కొని ఆయన సంతాపం తెలిపారు. తాము ఎప్పుడూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఈ సందర్భంగా వివరించారు. పిల్లి సూర్యప్రకాష్ వెంట రామచంద్రపురం మండల అధ్యక్షులు అంబటి భవాని, కె.గంగవరం ఎంపిపి పంపన నాగమణి సుబ్బారావు, సర్పంచ్ పి.సూర్య ప్రకాష్, గ్రామ నాయకులు తదితరులు ఆయన వెంట ఉన్నారు.




పరామర్శిస్తున్న పిల్లి సూర్యప్రకాష్,ఎంపిపి తదితరులు

పల్ల వెంకన్న నర్సరీని సందర్శించిన ఐజి

ప్రజాశక్తి- కడియం

కడియం పల్ల వెంకన్న నర్సరీని ఐజి రవిప్రకాష్ శనివారం సందర్శించారు. నర్సరీ ఎంతో ఆహ్లాదంగా, అద్భుతంగా ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నర్సరీ చైర్మన్ పల్ల సత్యనారాయణమూర్తి, మేనేజింగ్ డైరెక్టర్ పల్ల వినయ్ వారికి స్వాగతం పలికారు. పచ్చని మొక్కలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, వృత్తిపరమైన ఒత్తిళ్లను అధిగమించడానికి ఇటువంటి నందనవనాల సందర్శనలు ఉపకరిస్తాయన్నారు. దేశ విదేశీ జాతి మొక్కలతో పల్ల వెంకన్న నర్సరీ వర్ణ వైవిధ్యాన్ని కల్పిస్తుందన్నారు. పాత తరం నుంచి నేటి అధునాతన రకాల మొక్కలు ఒకేచోట కనువిందు చేస్తున్నాయని రవి ప్రకాష్ కితాబిచ్చారు. ఆయన వెంట పలువురు జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



ఐజికి పూలమొక్కతో స్వాగతం పలుకుతున్న నర్సరీ యజమానులు

కిటకిటలాడిన వాడపల్లి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం శనివారం యాత్రికులతో కిటకిటలాడింది. ఉదయాన్నే స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం యాత్రికులకు దర్శనాలు కల్పించారు. తెలుగు రాష్ట్రాలు ఉండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి యాత్రికులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం అంతా కిక్కిరిసిపోయింది. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్ల చక్రధర్ రావు ఏర్పాట్లను పూర్తి చేసి పర్యవేక్షించారు. రాత్రి 9 గంటల వరకు భక్తులు రద్దీ కొనసాగింది. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.నిషాంతి స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు అర్చకులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదలతో పాటు స్వామివారి చిత్రపటం అందజేశారు.



జిల్లా జెసికి స్వామి వారిచిత్రపటం అందజేస్తున్న ఆలయ డిసి

బాల బాలాజీ ఆలయానికి రూ.1.51 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయానికి పలు సేవల ద్వారా రూ.1,51,984లు ఆదాయం లభించిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. దర్శనం లడ్డు ప్రసాదం తదితర విక్రయాల ద్వారా రూ.1,01,215లు ఆదాయం రాగా నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.50,769లు విరాళాలుగా సమర్పించారన్నారు 2,900 మంది భక్తులు స్వామివారిని దర్శనం చేసుకోగా 1,876 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.

మందేశ్వరస్వామి ఆదాయం రూ.1.55 లక్షలు

కొత్తపేట: మండలంలో మందపల్లి గ్రామంలో వేంచేసియున్న మందేశ్వర స్వామి దేవస్థానం నందు అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు స్వామివారికి శనివారం తైలాభిషేకములు ద్వారా రూ.1,26,635 అన్న ప్రసాదం విరాళాలుగా రూ.28,500 మొత్తం వెరసి రూ.1,55,135 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి తెలిపారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన ఆధార్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ జాన్ లింకన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ ఆధార్ స్పెషల్ డ్రైవ్ క్యాంపులను మండల పరిధిలోని ఆయా గ్రామ సచివాలయాల్లో షెడ్యూల్ ప్రకారం ఈనెల 22న పినపళ్ల, పెనికేరు, మూలస్థానం, 23న చింతలూరు, సంధిపూడి, చొప్పెల్ల, 24న మోదుగూరు, ఆలమూరు, చెముడులంక, 25న గుమ్మిలేరు, ఆలమూరు, బడుగువానిలంక గ్రామాల్లో నిర్వహిస్తారన్నారు. అయితే ఆధార్ కార్డు పొంది 10 ఏళ్లు దాటి ఇప్పటివరకు ఒక్కసారి ఆధార్ అప్డేట్ చేయించుకోని వారు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పొడగట్లపల్లిలో వంట శాల ప్రారంభం

ప్రజాశక్తి - రావులపాలెం

అన్న క్యాంటీ న్లకు అవసరమైన భోజనం, అల్పాహారం తయారు చేయడానికి రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నక్షేత్ర వంట శాలను శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ సత్యానందరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రెండు లక్షల మంది ప్రజలకు ఆహారాన్ని తయారు చేసి అందించేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఆర్‌డిఒ పి శ్రీకర్, తహశీల్దార్ ముక్తేశ్వరరావు, నిష్కన్ సన్ భక్త దాస, వైకుంఠేశ్వర దాస, సుఖి సాగర దాస, శ్యామ్ మాధవ దాస, స్థల దాత మంగిపూడి కృష్ణశాస్త్రి అండ్ సీతమ్మ ట్రస్ట్ చైర్మన్ మంగిపూడి శ్రీకృష్ణ పాల్గొన్నారు.

గ్రామ సభల ద్వారా సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-కాజులూరు, కరప

గ్రామ సభల ద్వారా రీ సర్వేలో ఏర్పడిన సమస్యలను పరిష్కరిస్తామని కాజులూ తహశీల్దారు ఎల్.శివకుమార్ తెలిపారు. శనివారం మండలంలోని జగన్నాథగిరిలో గతంలో నిర్వహించిన డ్రోన్ సర్వే వివరాలు తెలుసుకున్నట్టు తెలిపారు. ఈ గ్రామసభలో ఆర్ఐ వేగేశ్వరరావు, విఆర్ఒ ఈశ్వరరావు, సర్పంచ్ కొఠాని అచ్యుతాంబ, కొప్పన లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరప మండలంలో నిర్వహించిన సభలో పలు ఫిర్యాదులు అందినట్టు తహశీల్దారు ఎన్.సత్యనారాయణ తెలిపారు. సభలో తొమ్మిది ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏసుబాబు, జనసేన నాయకులు బండారు లక్ష్మణ్ ప్రసాద్, విఆర్ఒ ఎం.కిషోర్ పాల్గొన్నారు.